# మాద్రి

## 1

'నేనేం చేతునే మాతల్లీ ! కన్నకడుపు అని అయినా జాలిలేకుండా ఇంత కటికవాడైనాడేమే నీ తండ్రి !'

'అదేమిటి అమ్మమ్మా - నాన్న నాకోసమే... నేను సుఖపడాలనేకాదూ...చేసే యీ నిర్వాహకం !'

'హాయ్యో! నిర్భాగ్యురాలా...నల్లనివన్నీ నీళ్లూ, తెల్లనివన్నీ పాలూ నీకంటికి...ఎలా బ్రతికి బట్టకడతావే.'

'ఇక, కట్టేవన్నీ బనారసుచీరలే ! పెట్టిననగ పెట్టకుండా, తొడిగిన రవిక తొడగకుండా...ఓ!...మహారాణి నౌతాను, నాకేం...తీపెళ్ళిందా?...ఎంత వైభవం?'

'...భళ్లున తెల్లవారినట్టే ఉంది !'

'సందెపడేటప్పటికి గూట దీపం పెట్టేవారు లేర నేనా...పాపం....ఆతడు ఇంత తొందరపడుతూంది; మరేం, అంత ఊసు తప్పయితే, మగవాడికి కూడా విధవరికం మన శాస్త్రాల్లో వ్రాసిపెట్టించకపోయినారూ ? ఆ పిల్లదానికి భూమిమ్మీద అన్నోదకాలు కరవై....అది పోయిందికదా అని....ఇవతల ఈతడు అఘోరించుతూ కూర్చుండవలసినంత అవసరం ఏం వచ్చిందీ ? తెల్లవారితే అప్పుడే నాలుగా

మైనా....యీవారం ఏలాగో కళ్లుమూసుకుంటే మైల స్నానం....మంగళస్నానం.... రెండూ ఓమారే....'

'ఏమోలే, నీ కర్మానికి ... ఎవరుకర్తలు....'

'నా అదృష్టదేవతలు!.... నోయాలసిన నోములకు ఫలం....అప్పుడే అడ్డాన్నుగా నాకు దక్కుతూంటే....చూసి చంకలు కొట్టుకుంటూ సంబరపడటానికి బదులు, ఏమిటి నిండిన యింట్లో కూర్చుని....ఇలా ఆగాయిత్యం'....

'చాల్లే....నాతోబాటు సంతోషించాలి కాని....బిక్క మొగం వేసుకుని లేనిపోని చిక్కు తెచ్చిపెట్టక....ఇంకా వ్యవధిఉందా .... యీలోపుగా మళ్ళా తలుపుదగ్గిర పాటలూ .... తలుపు గడియ పడకముందు పాడాలిసిన పాటలూ .... అప్పుడు నట్టుపడకుండా .... ఓమారు పల్లించుకో....'

.... .... ....

'కృష్ణా...

నిన్ను ఇంత చనువుగా పేరుపెట్టి పిలవలేదు....సిగ్గు విడిచి నీయెదటపడి మాట్లాడలేదు.'

'ఇప్పుడు....సిగ్గుపడి లాభంలేదు.'

'నా మనసులో ఏమున్నదో నీకు అంతు చిక్కించక పోయినా....నీమనసులో కోరికలు....ఎప్పటికప్పుడు, నీవు కిటికీదగ్గర నిలుచున్నప్పుడల్లా, నీ చూపులు నాకు తెలుపుతూనే ఉన్నవి...

'కాని, ప్రయోజనంలేదు...అందని మ్రానిపండు...

అది ఎవరి దోసిలిలో రాలితే...మనకు ఒరిగేది ఏముంది... అని మనసును వెన్నగా మళ్ళించుకో...'

'నీకు అంతయిష్టమైతే ... అవసరమైతే ... నన్ను జ్ఞాపకం ఉంచుకో!'

... ... ...

'తాతాయ్యా!...నవలల్లో చదువుతాం చూడు... పెద్దకోపంవచ్చినప్పుడు అందులో వీరుడు ఏంచేస్తాడు?-

'పళ్లు పటపటలాడించి జుట్టుపీక్కుంటూ'

'పాపం నీ కా యోగం లేదుకదా ... ఈ వార్ధక్యంలో...ఇదే ఇంకో పాతికేళ్ళక్రిందనైతేనా...'

'కాదులే ... అప్పుడైనా నీ కా ఛాన్సు వచ్చేది కాదులే...యీ సినిమాలు ముదిరిన తరువాతనేగా ... నాలాటి వెర్రిపిల్లలు కళ్లు తెరిచింది...'

'కంట నీరుపెట్టాకో ... నా మనసు చివుక్కుమంటుంది...నడుంకట్టుకుని పెత్తనం చేయవలసినవాడవు... జబ్బలు నవరించుకో.'

... ... ...

## 2

'గృహిణి వచ్చి గూట దీపం పెట్టగానే...'

'మీకు-గుండె గుభీలుమనేలాగుంది అత్తా!... తెలిసినవారు, ఏలా నడవాలో తీర్చి దిద్దుకోండి...'

'తెలిసింది...నా తెలివి తెల్లవారమట్టే హయ్యో

భగవంతుడా! మావాడి బ్రతుకు చివరకు ఇలా అఘోరించిం దేమా అని...నడవాలో కంట ఒత్తివేసుకుని పడిగాపులు పడి...ఆలకిస్తున్నా...వాడి ప్రాణానికి...'

'నేను దాపురించింది...ఆయన సుఖంగా ఉండటానికే కాదండీ...'

'ఈ శ్రీరంగనీతుల కేం...సందెపడగానే...ఇప్పుడున్నబుద్ధి.. వాడు చెప్పలేక ... చెప్పలేక...పిచ్చిపాడగట్టు...నాదగ్గిర బావురుమన్నాడు ... సరి, చూద్దును గదా...నీవాలకం...ఆడజన్మఎత్తింది... అణగి మణగి పడి ఉండటానికా...మగవాడిని రాచిరంపానపెట్టడానికా ... అక్కరలేనిదానవు ... అక్కరలేనట్టుగానే ఉండలేక పోయావూ? లేక...ఏరాజ్యాలన్నా ఏలుదామనా...యీ దిలాసా?'

'వారూ మీరూ...ఏరీ కోరీ కట్టబెట్టింది... యీ రాజ్యాన్నేకదా, ఏలడానికి! ఇంతకన్నా ఎక్కువ...ఎక్కడ మాత్రం దొరుకుతుందా?'

'ఆ జ్ఞానం ఉంటేనా...ఏలుకునేవాడు ఎంత పరితపించిపోతున్నాడో అని కనికరం నీకు ఉంటేనా?...'

'...అమ్మా!

నా జన్మకు ఇహ సుఖపడేయోగం లేదేమోనమ్మా...పెళ్ళినాడు మెడనుపడ్డ జంధ్యం...పెద్దదానితోనే పెరిగిపోయిందమ్మా...ఎన్నిముడులు వేసినా ఏంలాభం...'

'అయ్యో నాతండ్రీ!...చూసి చూసి నీకీ రొమ్ముల కుంపటి ఎత్తానేమిరా? ఈ శిఖండితో ఏలా వేగుతావయ్యా!'

'ఏనాడు కష్టంలో స్తే... 'జా పరమేశ్వరా' అని ఏ కాళో లేచిపోతాను. నా పీడ విరగడఅయిపోతుంది... పెళ్లాం ఉన్నా...సన్యాసినే...'

'నా బొందిలో ఊపిరుండగా...నీకు వచ్చిన ఫరవా ఏమీ లేదురా, నాయనా! నీ వాకిలి ఊడ్చటానికి వచ్చిన శానిసకూతురు...నీచెప్పుచేతల్లో పడిఉండక ఏ చెరువునీళ్లు త్రాగుతుందో చూస్తానుగా... మొండికి మొండే ప్రతి... నీవు లాలించినకొద్దీ దాని ఆగడం ఇలాగే రెచ్చిపోతుంది. నాలుగుచరిచి అన్నా లొంగదీసుకోవాలి కాని... చెట్టైవంగనిది...ఇకముందు నీపాట్లు అడిగావూ...ఎద్దు నడిగి గంత కడతారటరా...ఎక్కడన్నా ఉందా ఇది ... నీ యిష్టం ఇక...అంతా నీచేతులో ఉంది...'

... ... ...

'మంచినీళ్ళు కావాలి!'

'మీ అమ్మగారిని అడగండి'

'ఎంతమాట అన్నావూ! మానాభిమానాలు ఏకో శానా లేవుగదా...అమ్మని అడగాలా అంట!...అయితే మరి, బొమ్మవు నీవెందుకూ...తినిపెట్టడానికా...'

'కాదు...కని పెంచడానికి తల ఒగ్గకపోతే...తినే ముద్దకూ కరువు వస్తుంది.'

'ఆమాట ఎత్తితే...నీకు ఎక్కడలేని తలనొప్పీ... వేయిపుట్లు జ్వరమూ ముంచుకువస్తుంది...'

'అవును...నాముఖానే ప్రొద్దుపొడిచింది...నేనూ ఓ మనిషినే...

'నేను...మ్రాకును...అదేనా నీ వనేది ... మూడు రోజులనుంచీ వళ్లు సలసలా కాగుతూంది...ఆర్చేదిక్కు ఉంటేనా...'

'అన్నింటికీ మీకు దొరికింది...అదేవంక...ఇలా అనుక్షణం పట్టి పల్లార్చుతూంటే...ఎవతె బ్రతుకుతుంది... మీ చేతుల్లో...ఈ కడగండ్లుగడిచి... పోయిందే అదృష్ట వంతురా లనుకుంటే..దానికి ప్రతిగా మళ్లా నేను వెల శాను...వంటింట్లో కుందేలు ... మన్ని తప్పించుకుపోలేదు కదా అనేకాదూ మీ చెలగాటం...'

'అలా దోవకు రా...'

'మీకు...ప్రాణంమీదన్నా ఆశలేదూ?'

'ప్రాణంమీదకన్నాకూడా...'

'అంతేనా...'

'ఆహా...బ్రతికిన నాలుగు గడియలూ సుఖపడక పోతే...'

'నేను ఎంత చెప్పినా...వినవు; మొరపెట్టుకున్నా ఆలకించవూ...ఇక మనకూ...పశువులకూ ఏమిటితేడా...'

'పదిమాట్లకు... వేయిమాట్లకు నేను పశువునే... నిన్ను చేసుకున్న తరువాత...నాకు అభిమానం ఎందుకూ? ఎంత వదరినా ఇప్పుడు నిన్ను వదిలేదిలేదు...చూద్దాం... నీ తాత ఎవరు అడ్డం వస్తాడో...పద...'

'తాతజోలి ఎందుకులెండి...ఆ కీర్తి నేనే దక్కించు కుంటాను...'

# 3

నాలుగు గడియల్లో ఎంత ముంచుకువచ్చిందీ...నా బంగారుతండ్రిని నీ పొట్టను పెట్టుకుంటావటే మహామారీ!... తోడకాదు...దీన్ని నిలువునా చీల్చండయ్యా తండ్రుల్లారా...మా పాలిటికి ఎక్కడ దాపురించావే...నీముఖం..'

'ఊరుకోండి అత్తా...మన మేంచేయగలము? ఆ మహారాజుకు భూమ్మీద చిట్టెడుప్పు కరువైపోయింది. పోయినవారితో మనం పోతామా ... పోగలమా? ... తాతయ్యా! పాపం...మా వాళ్ళకు ఎంతకామాటం అనుకున్నావు? స్వంతవ్యవసాయమా...ఇచ్చిపుచ్చుకోవడాలూ... గంపంత వ్యవహారం ... ఒక్కర్తే తిప్పలుపడాలి ఇక... అయినా మెలిగినచేయికనుక ఇబ్బంది ఉండదులే...'

'ఏమనుకోమోకండమ్మ...పైత్యంచి వెర్రిమాటలు వస్తున్నాయి దానికి...'

'నీవూ నీ మనుమరాలూ, కట్టకట్టుకుని గంగలో దూకండి...'

'--దూకమంటారేకాని...లోకానికి వెరవాలిసిన అవసరం మనకేముంది అత్తా! మునిగినవారు...మునగగా...ఒడ్డుకు చేరినవాళ్ళు...వంతు దీర్చుకోవద్దూ? కాదా మరి ... తాతయ్యా! ... సహధర్మచారిణి ఏదో విధంగా నడుచుకుంటే ఆలోకంలో ఉన్న ఆయన మనసు ఎంతో బాధపడిపోదూ?...ఆయనే మిగిలి...దైవవశాన నేనే రాలిపోయి ఉంటే...ఆ సద్బ్రాహ్మణుడు...అత్తగారూ మూణ్ణో

నాటికల్లా...గుమ్మటంలాంటి పడుచును ఎక్కడనుంచో ఏరి కోరి వెదుక్కు తెచ్చుకుని గృహపావనం చేసుకునే వారేనా?

'ఉత్తమగతుల ప్రాప్తి ఆశించేదాన్నే అయితే... ఆయన అడుగుజాడల్లో మెలిగితే...నాకు ఎన్నిక ఉంది కాని...'

'అత్తయ్యా! ఉరిమిచూడబోకండి. శుభమస్తు అనడానికి బదులు నే నేమీ లోపం చేయను..

'స్వరూపాలకి భేదమే కాని...భగవంతుడు నిర్దేశించిన వైవాహికధర్మస్వరూపం మారలేదని...నా పెళ్ళి నాడు...పెద్దలందరికీ మీరు నీతి ఉపదేశించినవారు కారండీ!...ఒప్పుకున్నాను.

'తాతయ్యా!...మైల వెళ్ళిపోగానే మంచి ముహూర్తం ఏర్పాటుచేయి ...... కృష్ణుని పెండ్లికొడుకును చేయించు...కోపంతో కొరకొరలాడు...అంతే, నీపుణ్యమాయెను కాని...పండ్లు కొరకబోకు...మళ్ళా కట్టించడం... ఇప్పుడు నాన్నకు మళ్ళా అదో అదనపు ఖర్చు.

---